క్లుప్తంగా

ఉపాధ్యాయుడి దంపతులకు సత్కారం



రామకోటిరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సంతనూతలపాడు: మండలంలోని ఎనికెపాడు హైస్కూల్లో శనివారం ఉద్యోగ విరమణ చేస్తున్న ఉపాధ్యాయుడు మల్లవరపు రామకోటిరెడ్డి, అంజమ్మ దంపతులను సన్మానించారు. సర్పంచ్ తలారి వెంకట్రావు, హైస్కూల్ హెచ్ఎం కే కోటేశ్వరరావు, తదితర ఉపాధ్యాయులు పాల్గొని రామకోటిరెడ్డి సేవలను కొనియాడారు. మే 31వ తేదీ పదవీ విరమణ చేస్తుండగా, ఆ సమయంలో వేసవి సెలవుల కారణంగా ముందస్తుగా ఉపాధ్యాయుడి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో చిలకపాడు హైస్కూల్ హెచ్ఎం సువర్ణరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాజిటివ్ లైఫ్ మాసపత్రిక ఆవిష్కరణ



మాసపత్రికను ఆవిష్కరిస్తున్న ఏకేయూ రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ: స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలోని రిజిస్ట్రార్ చాంబర్‌లో ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ పెద్దిగారి లక్ష్మణ్ణ రచించిన పాజిటివ్ లైఫ్ మాసపత్రికను ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాసపత్రికలో విద్యార్థులకు, సాధారణ పౌరులకు, ఉపాధ్యాయులకు, కుటుంబ సభ్యులందరికీ ఉపయోగపడే సమాచారం ఉందని తెలిపారు. అంతేగాకుండా విద్య, వైద్యం, క్రీడలకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం కూడా పొందుపరచడం జరిగిందన్నారు. ఇలాంటి మ్యాగజైన్‌లను వయసుతో నిమిత్తం లేకుండా ప్రతిఒక్కరూ చదివి జీవనశైలి మార్చుకోవాలని సూచించారు. ఏకేయూ సీడీసీ డీన్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ జి.సోమశేఖర మాట్లాడుతూ సగటు వ్యక్తి మనస్తత్వాన్ని తెలుసుకునేందుకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మ్యాగజైన్ రచయిత, ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ పెద్దిగారి లక్ష్మణ్ణను ఏకేయూ రిజిస్ట్రార్ హరిబాబు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ సోమశేఖర, తదితరులు అభినందించారు. అనంతరం రిజిస్ట్రార్ హరిబాబును పుస్తక రచయిత డాక్టర్ లక్ష్మణ్ణ దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్టు, ప్రోగ్రెసివ్ సైకాలజిస్టుల అసోసియేషన్ నేత డాక్టర్ పసుపులేటి పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



1,561వ ర్యాంకు సాధించిన హాసిని

ఒంగోలు సిటీ: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఒంగోలుకు చెందిన విద్యార్థిని ఆర్వీ హాసిని ఆలిండియా స్థాయిలో 1,561వ ర్యాంకు సాధించింది. ఈమె ఇంటర్ విద్యను విజయవాడలో పూర్తిచేసింది. హాసిని తండ్రి కృష్ణారెడ్డి జలవనరుల శాఖలో పనిచేస్తుండగా, తల్లి జ్యోతి ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. హాసిని సోదరుడు ఇప్పటికే ఐఐటీ నుంచి ఇంజినీరింగ్ పూర్తిచేశారు. ఈ సందర్భంగా హాసినికి పలువురు అభినందనలు తెలిపారు. అదేవిధంగా స్థానిక ఉమామహేశ్వర కళాశాల విద్యార్థులు వి.దీపక్ 15,586వ ర్యాంకు, డి.ఈశ్వరమణికంఠ 20,492వ ర్యాంకు, డి.మెర్సీబాబు 32,312వ ర్యాంకు, ఆర్.పూజశ్రీ 36,417వ ర్యాంకు, ఎన్.ప్రేమ్‌సాయి 39,481వ ర్యాంకు, డి.యామిని 40,469వ ర్యాంకు సాధించినట్లు కళాశాల డైరెక్టర్లు సి.మల్లేశ్వరరావు, సి.జయలక్ష్మి తెలిపారు. శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ఎం.సౌమ్యశ్రీ 5372వ ర్యాంకు, నాగుల్ల వెంకట సూర్యకిరణ్ 7,021వ ర్యాంకు, రావూరి అమూల్య 8132వ ర్యాంకు సాధించినట్లు ఒంగోలు బ్రాంచ్ డీన్ ఎం.రామకృష్ణ తెలిపారు. విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

పేకాట శిబిరాలపై దాడులు

కొత్తపట్నం: పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు చేశారు. అల్లూరు శివారు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం పేకాటాడుతున్న విషయం తెలుసుకున్న కొత్తపట్నం ఎస్సై సుధాకర్‌బాబు సిబ్బందితో కలిసి ఆయా శిబిరాలపై దాడులు చేశారు. ఏడుగురు జూదరులను అదుపులో తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.10,130 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని చెప్పారు.

ఎమ్మెల్యేగారూ.. వాటర్ ప్లీజ్..!

- ఒంగోలు నగరంలో రోజురోజుకూ అధ్వానంగా మంచినీటి సరఫరా
- మూడు రోజులకు బదులుగా నాలుగైదు రోజులకు సరఫరా అవుతున్న నీరు
- పాలకులు, అధికారులకు పట్టని తీరు
- ట్యాంకర్లు, రిక్షా పీపాల ద్వారా కొనుగోలు చేస్తున్న ప్రజలు
- గత ఎన్నికల సమయంలో రెండు రోజులకు ఒకసారి నీరిస్తామన్న ఎమ్మెల్యే జనార్దన్
- ఆ హామీ ఏమైందంటూ ప్రజల విమర్శలు



ఒంగోలు వన్‌టౌన్: నగరంలో నీటి సరఫరా తీరు అస్తవ్యస్తంగా ఉంది. రోజురోజుకూ మరింత అధ్వానంగా మారుతోంది. నగరపాలక సంస్థ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం నగరవాసుల పాలిట శాపమవుతోంది. నగరంలో మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతోంది. కానీ, ఇటీవల తరచూ నాలుగైదు రోజులకు ఒకసారి నీరు సరఫరా చేస్తుండటంతో ప్రజలు నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన ఉప్పునీటి కారణంగా బోర్లు కూడా లేకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ట్యాంకర్లు, రిక్షా పీపాల ద్వారా నీరు కొనుగోలు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. నీటి సరఫరా ఆలస్యమైన రోజుల్లో ఆయా ప్రాంతాలకు కనీసం ట్యాంకర్లను కూడా నగరపాలక సంస్థ అధికారులు పంపించకపోతుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో తమను గెలిపిస్తే రెండు రోజులకు ఒకసారి నగరంలో నీరిస్తామని స్థానిక టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. కానీ, కనీసం గతంలో మాదిరిగా మూడు రోజులకు ఒకసారి కూడా సక్రమంగా సరఫరా చేయించలేకపోతున్నారు. ఇక, రెండు రోజులకోసారి నీటి సరఫరా హామీ సంగతేంటంటూ ప్రజలు విమర్శిస్తూ నవ్వుకుంటున్నారు.

మండుటెండల్లో మంచినీటి సమస్యతో అవస్థలు...

ప్రస్తుతం వేసవి తీవ్రరూపం దాల్చింది. ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు వాడుకునేందుకు, తాగునీటికి నగరపాలక సంస్థ అధికారులు సరఫరా చేసే నీరే దిక్కు. ఇలాంటి సమయంలో నగరంలో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో మండుటెండల్లో నీటి కోసం ఏం చేయాలో అర్థంగాక ప్రజలు తీవ్రస్థాయిలో అవస్థ పడుతున్నారు. నగరంలోని కబాడీపాలెం, సంతపేట, అన్నవరప్పాడు, రామ్‌నగర్, భాగ్యనగర్, గాంధీరోడ్డు, తదితర ప్రాంతాల్లో గత రెండు విడతలుగా మూడు రోజులకు బదులుగా నాలుగు రోజులు, ఐదు రోజులకు ఒకసారి మంచినీటిని మున్సిపల్ అధికారులు సరఫరా చేస్తున్నారు. కనీసం ముందస్తు సమాచారం కూడా ప్రజలకు ఇవ్వకుండా నీటి సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో ఉన్న నీటిని కూడా పొదుపుగా వాడుకునే అవకాశం లేకుండా పోతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడో రోజే ఇవ్వాల్సిన నీటిని తరచూ నాలుగైదు రోజులకోసారి సరఫరా చేస్తుండటం, అది కూడా తక్కువ సమయమే ఇస్తుండటంతో సరిపోక అవస్థపడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. తాగునీటి కోసం నాలుగైదు రోజుల పాటు మంచినీటిని నిల్వ ఉంచినప్పటికీ.. పురుగులు పడుతున్నాయని, ఆ నీటిని ఎలా తాగాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

రిక్షా పీపాలకు పెరిగిన రేట్లు...

నగరంలో అనేక ప్రాంతాలకు నాలుగైదు రోజులకోసారి మంచినీరు విడుదల చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. ఇదే అదునుగా భావించి రిక్షా పీపాల ద్వారా నీరు సరఫరా చేసేవారు రేట్లు పెంచారు. గత నెల రోజులుగా నగరపాలక సంస్థ అధికారులు ఒకటీరెండు రోజులు ఆలస్యంగా మంచినీరు విడుదల చేస్తుండటాన్ని గమనించి ఒక్కసారిగా రూ.50 పెంచి రిక్షా పీపా ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. గతంలో రిక్షా పీపాకు రూ.100 తీసుకునేవారు. ప్రస్తుతం దాన్ని రూ.150కి పెంచారు. ఆ నీరు కూడా ఎక్కడి నుంచి తెస్తారో..ఎలాంటి నీరో కూడా తెలియని పరిస్థితి. అంత రేటు పెట్టి రిక్షా పీపా ద్వారా నీరు కొనుగోలు చేసినా తాగడానికి మళ్లీ బబుళ్లు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొనడంతో నగరవాసులు అల్లాడిపోతున్నారు.

వింతసాకులు చెబుతున్న అధికారులు...

గత నెల రోజులుగా తరచూ ఒకటీరెండు రోజుల పాటు నీటి సరఫరా ఆలస్యం కావడంపై నగరపాలక సంస్థ అధికారులు వింతవింత కారణాలు, కుంటిసాకులు చెబుతుండటం విడ్డూరంగా ఉందంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. ఒకసారి విద్యుత్ సరఫరా లేదని, మంచినీరు పంపింగ్ కావడం లేదని, మరోసారి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయిందని, ఇంకోసారి పైపులైన్లు పగిలిపోయాయని చెబుతూ కాలం వెలిబుచ్చుతున్నారు. కనీస బాధ్యత, ముందస్తు ఆలోచన లేకుండా వ్యవహరిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే కూడా దృష్టిసారించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో అధికారులు, సిబ్బంది ఇష్టారీతిన అధ్వానపు పనితీరుతో ప్రజలను అష్టకష్టాలకు గురిచేస్తున్నారు.

ఉత్తమ పౌరులుగా స్కౌట్స్ ఎదగాలి

- ఒంగోలు డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వర్



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వర్

సంతనూతలపాడు: స్కౌట్ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఒంగోలు ఉప విద్యాశాఖాధికారి ఎ.చంద్రమౌళేశ్వర్ పిలుపునిచ్చారు. సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలోని బీవీ సుబ్బయ్య హైస్కూల్ ప్రాంగణంలో శనివారం రెండో రోజు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల్లో దేశభక్తి, సేవాగుణాన్ని పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో స్కౌట్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల విద్యాశాఖాధికారి దగ్గుమాటి వెంకారెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్‌కు విద్య, ఉద్యోగాలలో ప్రభుత్వం రిజర్వేషన్ కల్పించిందని తెలిపారు. విద్యార్థులు రాష్ట్రపతి పురస్కార్ వరకు ఎదగాలని సూచించారు. జిల్లా స్కౌట్స్ కార్యదర్శి తన్నీరు బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో 36 పీఎం శ్రీ స్కూల్ నుంచి నలుగురు చొప్పున స్కౌట్ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో 5 రోజులు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గత మాసంలో 150 మంది బాలికలకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో కోర్సు లీడర్ నాగిరెడ్డి, అసిస్టెంట్ కోర్సు లీడర్ వెంకట్‌రెడ్డి, శేషారావు, ఉప్పలపాడు హెచ్ఎం వెంకట్‌రావు, స్కూల్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన స్కౌట్ మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక వారోత్సవాలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

చీమకుర్తి: ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్ పిలుపునిచ్చారు. పుస్తక దినోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను జేవీవీ నాయకులతో కలిసి శనివారం చీమకుర్తిలో ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు ప్రపంచ పుస్తక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుస్తకాలు చదవడం, శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన ఆవిష్కరణల పట్ల అవగాహన కల్పించడం వంటి అంశాలపై రానున్న వారం రోజుల పాటు పాఠకులకు వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్, జేవీవీ నాయకులు చలువాది బదరీనారాయణ, చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, నల్లూరి వెంకటేశ్వరరావు, చల్లా శ్రీనివాసరావు, చలువాది శ్రీనివాసరావు, షేక్ శిలార్ సాహెబ్, స్థానికులు పాల్గొన్నారు.

ఐసీయూలో అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు అవసరం



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఒంగోలు టౌన్: ఆస్పత్రుల్లో ఎక్కువగా ఐసీయూల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం ఒంగోలు నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఐసీయూల్లో అత్యవసర చికిత్స చేయించుకునే రోగులు ఉంటారని, అందువలన చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. వేసవిలో ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం సంభవిస్తే ముందుగా ఐసీయూలోని రోగులను సురక్షితంగా బయటకు తీసుకురావాలని చెప్పారు. హాస్పిటళ్లలో ఏర్పాటు చేసిన వివిధ రకాల అగ్నిమాపక పరికరాలు పనిచేసే విధానాన్ని డెమో ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా సహాయక అధికారి శ్రీనివాసుల రెడ్డి, కిమ్స్ సీఈఓ కె.అంకిరెడ్డి, వైద్యశాల సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలి



పాఠశాలలో విద్యార్థికి పుస్తకాలు అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: రాజ్యాంగంపై విద్యార్థులు సరైన అవగాహన కల్పించుకోవాలని, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరు రంగారావు అన్నారు. ఒంగోలు నగరంలోని డీఆర్ఆర్ఎం హైస్కూలు, హెచ్‌సీఎం హైస్కూలు, పీవీఆర్ బాలికోన్నత పాఠశాల, కేంద్ర గ్రంథాలయాలను శనివారం ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల విద్యార్థులకు సమాచార హక్కు ఐక్యవేదిక ప్రచురించిన భారత రాజ్యాంగం.. కనీస అవగాహన, రాజ్యాంగ నిర్మాణ సభలో డాక్టర్ అంబేడ్కర్ చారిత్రక వ్యాసాల పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పట్ల ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన కల్పించే విధంగా వచ్చే జూలై మాసంలో భారత రాజ్యాంగం.. కనీస అవగాహన అనే అంశం మీద వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 14 నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వేరువేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు జాతీయ సమాచార హక్కుల కమిషనర్ మాడభూషి శ్రీధర్ చేతుల మీదుగా నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. దేశ ప్రజలు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండటం తప్పనిసరన్నారు. రాజ్యాంగ సభ ఆశించిన తీరులో దేశ పౌరులు అభివృద్ధి చెందకపోవడానికి కారణం రాజ్యాంగం సక్రమంగా అమలుకాకపోవడమేనని చెప్పారు. దేశంలో ప్రస్తుతం పరిపాలన గాడి తప్పిందని, దాన్ని సక్రమ మార్గంలోకి తెచ్చుకోవాలంటే రాజ్యాంగాన్ని సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, ప్రజా సంఘాల నాయకులు పి.పేరయ్య, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు ఎల్.రాజశేఖర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ అప్పారావు, హెచ్ఎం మారేపల్లి సూర్యకుమారి, ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుండ్లాపల్లి పాఠశాలకు సామగ్రి అందజేత



విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్న మిడ్ వెస్ట్ ప్రతినిధితో ఏపీఎండీసీ అధికారి శివప్రసాద్‌రెడ్డి

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మిడ్ వెస్ట్ కంపెనీ ప్రతినిధి అంబటి శ్రీనివాసరావు శనివారం మూడున్నర లక్షల రూపాయల విలువైన సామగ్రి అందించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా పాఠశాలకు వస్తువులు అందించినట్లు ఆయన తెలిపారు. 9 సీసీ కెమెరాలు, కంప్యూటర్, 25 సైకిళ్లు, లైబ్రరీకి నాలుగు పెద్ద బల్లలు, 40 కుర్చీలు, డబుల్ బ్యాటరీ ఇన్వర్టర్ అందించినట్లు హెచ్ఎం ప్రభాకరరావు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ పీడీ శివప్రసాద్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ రవికుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్‌పై ఎంవోయూ

- క్విస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి



డాక్టర్ అనీల్‌కుమార్‌శర్మను సన్మానిస్తున్న క్విస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాల – మేఘాలయా షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ రీచ్ (నెక్టార్) మధ్య డ్రోన్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్‌పై ఎంవోయూ జరిగినట్లు క్విస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి తెలిపారు. క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో చదివే విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, కళాశాలలో డ్రోన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, డ్రోన్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ సెంటర్ పెట్టేందుకు నెక్టార్ సహకారం అందించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు రెండు సంస్థలు పరస్పరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నాయని చెప్పారు. రానున్న రోజుల్లో డ్రోన్ టెక్నాలజీ ఇంకా అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకోసమే క్విస్ కళాశాలలో డ్రోన్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో వివిధ సెంటర్లను వెతుకుతున్న తరుణంలో నెక్టార్ గురించి తెలిసిందని చెప్పారు. అలా నెక్టార్‌తో ఇప్పుడు ఒప్పందం కుదిరిందన్నారు. ఈ టెక్నాలజీలో మెళకువలు, ఆపరేటింగ్, తదితర అంశాలను విద్యార్థులకు అందిస్తామని, తద్వారా కమ్యూనిటీకి కూడా సాయపడతామని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నెక్టార్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అరుణ్ కుమార్‌శర్మ మాట్లాడుతూ ఎన్నో కాలేజీలను తాము సంప్రదించామని, కానీ, క్విస్ కళాశాల యాజమాన్యం ఎంతో ఆసక్తిగా తమని సంప్రదించిందని అన్నారు. ప్రీమియమ్ కళాశాలల్లో క్విస్ కూడా ఒకటని, ఇక్కడికి వచ్చి చూశాక ఆ విషయం అర్థమయిందని, రీసెర్చ్‌కి ఇస్తున్న ప్రాధాన్యత చాలా బాగుందని అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు కూడా ప్రత్యేక సెమినార్ ఇచ్చారు. క్విస్ కళాశాల డీపీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, సీఎస్ సీడీఈ డీన్, డీపీఎస్ఆర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ భార్గవ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ప్లానింగ్ డాక్టర్ చల్లారామ్, డీన్ డాక్టర్ సత్యమెహర్, డైరెక్టర్లు, డీన్‌లు, హెచ్‌వోడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారాములకు పట్టాభిషేకం

కొనకనమిట్ల: మండలంలోని గరిమినపెంట గ్రామంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారాములస్వామికి భక్తుల కోలాహలం నడుమ ఆనందోత్సాహాలతో, వేదపండితుల మంత్రోచ్చరణలతో సీతారాములకు పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. సీతారామ, లక్ష్మణ స్వామి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పట్టాభిషేకం ఉత్సవంలో భక్తులు వారు పోసి నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఈస్టర్ పండుగ సందర్భంగా అన్నదానం

ఒంగోలు వన్‌టౌన్: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఒంగోలులోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద శనివారం పేదలకు అన్నదానం చేశారు. దళిత హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పేముల యోహాను, ఎస్‌కే జిలానీ, కె.ఏసుదాసు, ఎస్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రన్ ఫర్ జీసస్



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

ఒంగోలు మెట్రో: ఆరాధన టీవీ మేనేజింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో బ్రదర్ దేవ ప్రియమ్ పుల్ల సారథ్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు భారీగా పాల్గొనగా ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఆరాధన టీవీ కో ఆర్డినేటర్ ఇమ్మానుయేల్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాస్టర్ డి.జాన్‌అగస్టీన్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు కల్వరి శిలువలో మరణించి సమాధి చేయబడి మూడోరోజు మృత్యుంజయుడైన సందర్భంగా ప్రతి సంవత్సరంలా ఈ శుభదినాన రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం పాస్టర్ అగస్టీన్ ప్రార్థనతో ర్యాలీని ప్రారంభించారు. నగరంలోని జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి వద్ద నుంచి నెల్లూరు బస్టాండ్, బండ్లమిట్ట, గాంధీ రోడ్డు మీదుగా ఆర్‌సీఎం చర్చి సెంటర్ వరకు, తిరిగి మస్తాన్ దర్గా మీదుగా ఎస్కోలు ప్రార్థన మందిరం, కబాడీపాలెం ఇండియన్ పెంతుకోస్తు చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ డి.ఆషేర్ పాల్, పాస్టర్ ఎస్.ఐజాక్ బాబు, పాస్టర్ జి.భగవాన్ దాస్, ఆర్.జోసెఫ్, కే క్రిస్టఫర్, డీ ఆశీర్వాదం, ఐ.ఫ్రాంక్లిన్, టీ తిమోతి, ఎం.ప్రేమ్‌కుమార్, కూచిపూడి శరత్‌కుమార్, పాలపర్తి విజేష్‌రాజ్, టి.సుమతి, కే సత్యకుమారి గ్లాడిస్టన్, పాస్టర్ కే.డానియల్ రాజేంద్ర, జేఎంబీసీ చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఐపీసీ చర్చిలో క్రైస్తవులందరికీ ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

ఈ వేస్ట్‌తో పర్యావరణానికి నష్టం



ఈ వేస్ట్‌పై అవగాహన కల్పిస్తున్న జీజీహెచ్ అధికారులు



చీమకుర్తి ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ వేస్ట్‌ను బయట పడేస్తున్న మున్సిపల్ అధికారులు, నాయకులు

ఒంగోలు టౌన్: పర్యావరణానికి ఈ వేస్ట్ తీవ్రమైన హాని చేస్తోందని, మానవ వినాశనానికి కారణమయ్యే ఈ వేస్ట్‌పై అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ బాలాజీ నాయక్, అడ్మినిస్ట్రేటర్ కె.అద్దయ్య అన్నారు. శనివారం స్థానిక జీజీహెచ్‌లో ఈ వేస్ట్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంట్లో వాడిపడేసిన ఎలక్ట్రానిక్ సంబంధిత వస్తువులను నిబంధనల ప్రకారం నిర్వహించాలని చెప్పారు. ఈ వేస్ట్‌ను నిర్లక్ష్యం చేయకూడదని, నిపుణుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. ఎలక్ట్రానిక్ పరికరాలలో ఉండే మెటల్స్ కారణంగా అనేక నష్టాలు సంభవిస్తాయని తెలిపారు. తొలుత జీజీహెచ్‌లోని వివిధ విభాగాల నుంచి ఈ వేస్ట్ సేకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రభాకర్, డిప్యూటీ ఆర్ఎంఓ చెంచయ్య, హెచ్‌ఓడీలు కళ్యాణి, సాగర్, శ్రీదేవి ప్రియ, నర్సింగ్ సూపరింటెండెంట్ ధనలక్ష్మి, శరత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: చీమకుర్తిలో మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యాలయాల్లోని పాత కంప్యూటర్లు, ఇతర వ్యర్థాలను సేకరించి ఒంగోలులోని ట్రిపుల్ ఆర్ సెంటర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, నాయకులు మన్నం ప్రసాద్, యడ్లపల్లి రామబ్రహ్మం, గొల్లపూడి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మతల్లి ఉత్సవాలు




బ్రహ్మంగారి నాటకంలోని ఓ సన్నివేశం

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): మండలంలోని కె.పల్లెపాలెం గ్రామంలో బంగారమ్మ తల్లి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తులు అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు, కాయలు, పండ్లు సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి, విజయవాడ వారి సౌజన్యంతో బంగారమ్మ తల్లి ఆలయ కళా ప్రాంగణంలో ప్రకాశం జిల్లా పౌరాణిక రంగస్థల కళాకారుల ఐక్యవేదిక వారిచే పౌరాణిక పద్యనాటక ప్రదర్శన జరిగింది. శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్రను నాటక రూపంలో ప్రదర్శించారు. కె.పల్లెపాలెం గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. 1వ బ్రహ్మం డి.సూర్యనారాయణ, 2వ బ్రహ్మం ఎం.శ్రీనివాసరెడ్డి పద్యాలను ఆలపించారు. గోవిందయ్య, పీర్‌సాహెబ్ ఎస్‌కే హాజరత్ పాడిన పద్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

అవినీతికి మారుపేరు.. కాంగ్రెస్

- బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు దామోదర్



ధర్నా చేస్తున్న బీజేపీ యువమోర్చా నాయకులు

ఒంగోలు సబర్బన్: అవినీతికి మారుపేరు.. కాంగ్రెస్ పార్టీ అని, ఇది దశాబ్దాలుగా రుజువవుతోందని బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు దామోదర్ ధ్వజమెత్తారు. నేషనల్ హెరాల్డ్ కుంభకోణం అత్యంత దారుణమంటూ స్థానిక ప్రకాశం భవన్ ముందు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధినాయకులపై చార్జ్‌షీటుకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ అల్లరి చేయడం దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అల్లర్లకు నిరసనగా ప్రకాశం జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు పువ్వాడి దామోదర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాస్, ఒంగోలు నియోజకవర్గ నాయకులు యానం చిన యోగయ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తలుపుల నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు కాకర్ల నాగేషు, రాజేష్ వర్మ, మాదాల నరేష్, విజయారావు, సత్యవతి పాల్గొన్నారు.